ఈనాడు
ములుగు
సోమవారం అక్టోబరు 7, 2024

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరుగుట్టపై శ్రీహేమాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొగత.. పర్యాటకుల పులకింత



జలపాతం నీటిధారలను తిలకిస్తూ..

వాజేడు, న్యూస్‌టుడే: బొగత జలపాతంలో సందర్శకులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో జలపాతం కోలాహలంగా మారింది. నీటి జలధారలను తిలకిస్తూ సందడి చేశారు. నీటి కొలనులో ఈత కొడుతూ కేరింతలు కొట్టారు. జలపాతం నుంచి వస్తున్న వరద నీటికి ఎదురుగా ఈత కొడుతూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు.

భద్రకాళి.. బంగారు తల్లి



స్వర్ణ కిరీటం,
జుటామకుటాలు, కర్ణ పత్రాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన ఓరుగల్లు శ్రీభద్రకాళి అమ్మవారు బంగారు ఆభరణాలతో దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు అనేకం ఉన్నాయి. పసిడి కాంతులతో దర్శనమిస్తున్న భద్రకాళి మాతను చూసి భక్తులు పులకించిపోతున్నారు.


● శ్రీదేవి శరన్నవరాత్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలు అమ్మవారికి అలంకరిస్తారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రాహ్మోత్సవాల్లో కొన్ని ఆభరణాలు అలంకరిస్తారు.

అమ్మవారి ఆభరణాలు ఇవే..

● బంగారు స్వర్ణ కిరీటం: 4 కిలోల 70 గ్రాముల 088 మిల్లీగ్రాములు ● కర్ణ పత్రము- 1 కిలో 202 గ్రాముల 004 మి.గ్రా ● కర్ణ పత్రము-1 కిలో 149 గ్రాముల 022 మి.గ్రా ● జటా మకుటం- 2 కిలో 273 గ్రాము 013 మి.గ్రా. ● జటా మకుటం 2 కిలోల 368 గ్రాముల 040 మి.గ్రా. ● తెల్లరాళ్లతో ముక్కు పోగు పెద్దది: 104 గ్రా. ● చంద్ర వంక బొట్టు: 65 గ్రా 300 మి.గ్రా. (124 చిన్న ఎరుపు రాళ్లు, 01 పెద్ద ఎరుపు రాయి) ● ఒక ఎర్ర రాళ్ల బంగారు గాజు 340 గ్రా. ● ఒక ఎరుపు రాయి ముక్కు పోగు 10 గ్రా. ● అష్టలక్ష్మి చెంబు 605 గ్రా 600 మి.గ్రా ● ఒక రాళ్ల ముక్కు పోగు 19 గ్రా 950 మి.గ్రా ● ఒక తెల్ల రాళ్ల ముక్కు పోగు 21 ముత్యాలు, ఒక ఎర్ర పూస, 13.600 మి.గ్రా ● లక్ష్మి కాసుల నెక్లేస్ 20 గ్రా. 570 మి.గ్రా ● లక్ష్మి కాసుల పేరు 21గ్రా. 300 మి.గ్రా. ● 2 బంగారు గాజులు 16 గ్రా. 220 మి.గ్రా ● లక్ష్మి రూపంతో ఉన్న పచ్చల కెంపుల హారం 086- 730 మి.గ్రా ● అమ్మవారి రెండు పెద్ద పుస్తెలు, తాడు, రెండు గొట్టాలు, రాగి తీగతో కలిపి 192 గ్రా. ● పెద్ద ముక్కెర రాళ్లతో 44 గ్రా. ● అమ్మవారి పెద్ద మాంగల్య సూత్రం, తాడు, బంగారు గొట్టాలు, బంగారు గుండ్లు 130 గ్రా. ● కాసుల పేరు, రాళ్ల ముక్కు పోగు 262 గ్రా. ● ఒక ముక్కు పోగు 18గ్రా 850 మి.గ్రా.

బ్యాంకు లాకర్‌లోనే..: రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలు, భక్తులు, దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలన్నీ హనుమకొండలోని బ్యాంకు లాకర్‌లో భద్ర పరుస్తారు. రోజు వారీగా అలంకరించే ఆభరణాలు దేవస్థానంలో ఉంటాయి.

–న్యూస్‌టుడే, రంగంపేట



























ప్రధాని మోదీని విమర్శించడం సరికాదు



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ రైతులకు రుణమాఫీ చేయలేదని మంత్రి సీతక్క విమర్శించడం సరికాదని భాజపా జిల్లా అధ్యక్షుడు బలరాం అన్నారు. బుధవారం ములుగులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా ఎన్నికల్లో రుణమాఫీ చేస్తానని హామీ ఇవ్వలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని.. కొంత మందికే రుణమాఫీ చేసిందని విమర్శించారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.20వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జి. కుమార్, నాయకులు కె.సురేందర్, రవీంద్రాచారి, కృష్ణాకర్‌రావు, రాజ్‌కుమార్, నాగరాజు, రవిరెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బిల్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కమలాపురం(మంగపేట),న్యూస్‌టుడే: బిల్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులు బలిజ మెగిలి, జక్కుల మోజేస్, ఇనుగాల వెంకటరాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కమలాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జీతాలు ఇవ్వటం లేదని కార్మికులు పోరాటం చేస్తున్నప్పటికీ బిల్టు యాజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. కార్మికులకు అండగా ఉండాల్సిన ఐకాస నాయకులు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఐకాస నేతల నిర్లక్ష్యంతో పది రోజుల్లో ఆరుగురు కార్మికులు వివిధ కారణాలతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రతిపక్ష నాయకులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ములుగు, న్యూస్‌టుడే: మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాల బాలికలు రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. నారాయణపేట జిల్లా ధన్వాడలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రెజ్లింగ్ పోటీలు జరిగాయి. అండర్-17 బాలికల 49 కేజీల విభాగంలో జె ప్రవళిక కాంస్యం, 53 కేజీల విభాగంలో ఎం.సింధుజ రజతం, అండర్-14 విభాగంలో కె.లక్ష్మీభవాని రజతం పతకాలు సాధించినట్లు ములుగు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనెటి శ్యాం, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్, కోచ్ సతీష్, ప్రధాన కార్యదర్శి నాగభూషణ్, కోశాధికారి రాంచందర్ అభినందించారు.

వన దేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొనేందుకు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గద్దెల ప్రాంగణంలో ఎత్తుబెల్లం, ఒడిబియ్యం, నూతనవస్త్రాలు, పూలు, పండ్లు, సమర్పించి కోరిన కోర్కేలు తీర్చాలని దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం పరిసర ప్రాంతాల్లోని చెట్లకింద విడిది చేసి రోజంతా ఆటపాటలతో గడిపారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. – మేడారం (తాడ్వాయి), న్యూస్‌టుడే:



వనదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

భద్రకాళి సన్నిధిలో పాలనాధికారి



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి అమ్మవారిని ఆదివారం రాత్రి ములుగు జిల్లా పాలనాధికారి దివాకర్ దంపతులు దర్శించుకున్నారు. ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు స్వాగతం పలికి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, రంగంపేట

మేడారం.. జనసంద్రం

వనదేవతల గద్దెలపై చలువ పందిళ్ల ఏర్పాటు

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: వన దేవతలు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఎండదెబ్బ తగలకుండా ఉండేందుకు దేవాదాయశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. మహాజాతర అనంతరం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు వర్షాకాలంలో గా లిదుమారానికి కొట్టుకుపోయాయి. ఇటీవల కాలంలో ఎండలు తీవ్రంగా ఉండటంతో భక్తుల, పూజారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన అధికారులు వరంగల్ నుంచి వెదురు తడకలు తెప్పించి కూలీల సాయంతో దేవతల గద్దెలు, భక్తులు ప్రదక్షిణలు చేసే మార్గంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.



గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లు వేస్తున్న కూలీలు. పరిశీలిస్తున్న పూజారి రమేష్

పనిచేస్తున్న నిఘానేత్రాలు..

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో నిఘా నేత్రాలను పునరుద్ధరించారు. మహాజాతర సమయంలో ఏర్పాటు చేసిన నిఘానేత్రాల్లో చాలా వరకు భక్తులు విసిరిన కొబ్బరి, బెల్లం వల్ల ధ్వంసమయ్యాయి. కేబుళ్లను కోతులు పాడుచేశాయి. నిఘానేత్రాలు లేని సంగతి తెలుసుకొన్న జేబు దొంగలు భక్తుల నగదు, నగలు కాజేస్తున్నారు. దీనిపై దృష్టిసారించిన అధికారులు హనుమకొండ నుంచి నిపుణులను తీసుకువచ్చి గద్దెల ప్రాంగణం, పరిసరాల్లో 25 నిఘానేత్రాలను ఏర్పాటు చేశారు. కమాండ్‌కంట్రోల్ రూంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు.

గేటు సరే.. కంచె ఎక్కడ...?



పంచాయతీరాజ్ అధికారుల పనితీరుకు ఈ ఫొటోనే నిదర్శనంగా కన్పిస్తోంది. ఏటూరునాగారం మండలంలోని అల్లవారిఘనపురం పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలోని మొక్కల రక్షణకు గేటును ఏర్పాటు చేశారు. చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. ముందు గేటు మాత్రమే ఉంచి పక్కన కంచె ఎందుకు ఏర్పాటు చేయలేదో అధికారులకే తెలియాలి. ఆ మాత్రం దానికి గేటు కూడా ఉండి ప్రయోజనం లేకుండా పోయింది. –న్యూస్‌టుడే, కన్నాయిగూడెం

౯౦ శాతం సన్నాలే సాగు..!

ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం సన్నద్ధం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా వానాకాలం ధాన్యం సేకరణకు అధికారయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల సంఖ్య, లక్ష్యాన్ని ప్రకటించింది. మరో 25 రోజుల్లో వరికోతలు ప్రారంభం కానుండడంతో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో వాటి సేకరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలపై దృష్టిసారించారు.

–ఈనాడు, మహబూబాబాద్

‘ఉమ్మడి వరంగల్‌లో ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 9,02,233 ఎకరాల్లో వరి సాగవుతోంది. క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మొత్తం సాగులో 90 శాతం వరకు ఇవే ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీని ప్రకారం 10 శాతమే దొడ్డు రకాల సాగైనట్లు లెక్క.’



ధాన్యం కొనుగోలు కేంద్రం(పాత చిత్రం)

ధాన్యం ధరలు

☛ ఏ గ్రేడ్ రకం (క్వి. రూ.): 2320

☛ సాధారణ రకం (క్వి.రూ.): 2300

జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	● ధాన్యం కేంద్రాల సంఖ్య	● ధాన్యం సేకరణ లక్ష్యం(టన్నుల్లో)
మహబూబాబాద్	234	2,88,000
వరంగల్	203	2,40,000
భూపాలపల్లి	189	2,00,000
జనగామ	180	2,00,000
ములుగు	173	1,50,000
హనుమకొండ	149	1,50,000

ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,128 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 12.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్దేశించుకున్నారు. అత్యధికంగా మహబూబాబాద్, అత్యల్పంగా హనుమకొండ, ములుగు జిల్లాల్లో సేకరణ లక్ష్యం ఉంది. 12.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు 3.07 కోట్ల గన్నీ సంచులు అవసరం. అకాల వర్షం వస్తే నష్టం జరగకుండా టార్పాలిన్ పరదాలు అవసరం. ఇందుకు దాదాపు 35 వేల పరదాలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఏఈవోలే కీలకం

ధాన్యంలో తేమశాతం, నిబంధనల ప్రకారం సన్నాల నిర్ధారణ చేసి టోకెన్లు జారీ చేయడంలో వ్యవసాయ విస్తర్ణాధికారులు(ఏఈవో) కీలకం. బోనస్ వర్తించే 33 రకాల సన్నాల గుర్తింపులో తగిన జాగ్రత్తలు పాటించాలి. సన్నధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. ఈ యంత్రం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు.

ఇలా గుర్తిస్తారు..

ప్రతి గ్రామంలో సన్నాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఒకేచోట రెండూ కొనుగోలు చేస్తే తూకాలు వేర్వేరుగా చేస్తారు. సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుడుతారు. సన్నాల బస్తాలపై ‘వై’ ఆకారం గుర్తును, కొనుగోలు కేంద్రం సంఖ్య ముద్ర వేయాలని అధికారులు నిర్ణయించుకుంటున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

☛ కేంద్రాల వద్ద రైతుల కోసం నీడ, తాగు నీటి వసతిని కల్పించాలి.

☛ తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి.

☛ కాంటా పూర్తయిన వెంటనే బస్తాలను మిల్లులకు తరలించాలి. మిల్లరు సైతం ధాన్యంలో తేడాలున్నాయని సాకులు చెబుతూ పెట్టే కోతలను నివారించాలి.

☛ ఏఈవోలు ఇచ్చిన టోకెన్ల ప్రకారం తూకాలు వేయాలి.

విహారానికి వచ్చి మృత్యుఒడిలోకి..

● దుసపాటిలొద్ది జలపాతంలో యువకుడి మృతి



అభినవ్ (దాచినచిత్రం)



జలపాతంలో విగతజీవిగా

వాజేడు, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి సరదాగా జలపాతంలో గడిపేందుకు వచ్చిన యువకుడు ఆదివారం ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల సమీపంలోని దుసపాటిలొద్ది జలపాతంలో మునిగి మృతిచెందారు. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన బండారి అభినవ్ (19) ఘట్‌కేసర్ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులు ఆరుగురితో కలిసి ఆదివారం ఉదయం కొంగాల సమీపంలోని దుసపాటిలొద్ది జలపాతానికి చేరుకున్నారు. కొంగాల అడ్డరోడ్డు వద్ద విధులు నిర్వహించే అటవీ సిబ్బంది రావడానికి ముందుగానే జలపాతానికి వెళ్లారు. స్నేహితులతో కలిసి సరదాగా నీటిలో గడిపేందుకు జలపాతంలో దిగిన అభినవ్ నీటిలోని రాయిపై అడుగువేసిన వెంటనే నీటిలోకి జారిపోయాడు. సంఘటనను గుర్తించిన స్నేహితులలో ఒకరు కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాజేడు ఎస్సై హరీశ్ వాజేడు నుంచి మత్స్యకారులను, కొంగాల పంచాయతీ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపారు. దుసపాటిలొద్దిలోని లోతైన నీటిలో మత్స్యకారులు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. దట్టమైన అటవీప్రాంతంలోని దుసపాటిలొద్ది జలపాతం నుంచి స్ట్రెచర్‌పై మృతదేహాన్ని స్థానికులు మోసుకొచ్చారు. మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలించారు. స్నేహితులతో కలిసి జలపాతానికి వచ్చిన అభినవ్ ప్రమాదవశాత్తు మృతిచెందాడని మృతుడి బాబాయి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రమదానంతో గుంతల పూడ్చివేత



గుంతలను కంకరతో నింపిన వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారి

వాజేడు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. కష్టాలను తీరుస్తారనుకుంటే పనులు జరుగవనుకున్నారు. వాజేడు-గుమ్మడిదొడ్డి రహదారిలోని కొంగాల వాగు వంతెన సమీపంలో అప్రోచ్ రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నేతలు విక్రాంత్, జగన్నాధరాజు, వాసు, మాజీ సర్పంచి కృష్ణ, రైతులు సత్యనారాయణ, వినోద్, ఆదినారాయణ తదితరులు చొరవ తీసుకుని సొంత ఖర్చులతో కంకర, మట్టిని తెప్పించి గుంతలను పూడ్చివేశారు. జగన్నాధపురం-వాజేడు రహదారి మైసమ్మ సమీపంలో ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను సైతం మరమ్మతులు చేపట్టారు. నిత్యం ఈ రహదారులపై వాహనదారులు ప్రమాదానికి గురవుతుండటంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గుంతలను పూడ్చినట్లు పేర్కొన్నారు.

పండగ వేళ.. ట్రాఫిక్ పద్మవ్యూహం

● సిబ్బంది లేక ఇబ్బందులు

● ప్రతినెలా 4 వేల వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.



కాజీపేట బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ.. ఇక్కడ రైల్వే వంతెన ఒకటే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న మరో రైల్వే వంతెన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సామగ్రి, దుస్తుల కొనుగోళ్లకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివస్తున్న ప్రజలతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. కాజీపేట నుంచి వరంగల్, కరీంనగర్ రహదారిలో వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పండగ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, నగరవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..



తిరుమల జంక్షన్‌లో..



ఇదీ పరిష్కారం..

- రోడ్లు ఇరుకుగా ఉండి జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్‌వేలను ఏర్పాటు చేయాలి.
- సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం కళాశాలలు, పాఠశాలల సమయంలో అదనంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి.
- రద్దీని బట్టి ట్రాఫిక్ కూడళ్ల వద్ద అదనంగా సిబ్బందిని కేటాయించాలి.

రోడ్లపై 2 లక్షలకు పైగా వాహనాలు..

● పోలీసు శాఖ లెక్కల ప్రకారం కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో రెండు, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు కలిపి సుమారు 4.50 లక్షల వరకు ఉంటాయి. ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి లక్ష వరకు వాహనాలు నగరానికి వచ్చి వెళ్తుంటాయి. అన్ని కలిపి నగరంలో రోజుకు 2 లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయని పోలీసుల అంచనా. పండగల వేళ మరో 20 వేలు అధికంగా తిరుగుతుంటాయి.

ఇదీ పరిస్థితి..

పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రస్తుతం నగరంలోని మూడు ట్రాఫిక్ ఠాణాలోని సిబ్బంది సరిపోవడం లేదు. ఏఆర్ విభాగం నుంచి కొందరిని కేటాయించారు. అయినప్పటికీ కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి, పెట్రోల్‌పంపు, లష్కర్‌బజార్, హనుమకొండ చౌరస్తా, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, నయీంనగర్, వరంగల్ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, ఎస్‌వీఎన్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటుగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

● పదేళ్లలో నగరంలో వాహనాల సంఖ్య వంద శాతం పెరిగింది. ఆ స్థాయిలో రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. పండగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాలి.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు ఇలా..

నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు విధించిన ట్రాఫిక్ చలాన్లు కేసుల నమోదు

ఉల్లంఘనలు	కేసుల సంఖ్య	జరిమానా (రూ.లలో)
హెల్మెట్ లేకుండా చలాన్లు	2,56,767	4,24,71,300
రాంగ్ రూట్ డ్రైవింగ్	11,531	22,92,400
ట్రిపుల్ రైడింగ్	10,261	1,19,91,600
చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్	6004	59,58,000



వరంగల్ చౌరస్తాలో అన్ని వైపులకు ఒకరే ట్రాఫిక్ పోలీసు..

సిబ్బంది సంఖ్య పెరగాలి..

ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 14 నుంచి 16 కిలో మీటర్ల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇన్ని కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలంటే సుమారు 400లకు పైగా సిబ్బంది అవసరం.

● ప్రస్తుతం 140 మంది ట్రాఫిక్ సిబ్బంది, 100 మంది హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు పెరిగాయి. నగర శివారులతో కలిపి మొత్తం 51 ట్రాఫిక్ పాయింట్లు, 11 సిగ్నల్స్ ఉన్నాయి.

● నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణాలు మాత్రమే ఉన్నాయి. మరో మూడు అవసరం ఉంది.

పార్కింగ్‌తో సమస్య..

నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.

ఇలా చేద్దాం: షాపింగ్ మాల్స్ ఆవరణలోని సెల్లార్లల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. రాంగ్ రూట్‌లో రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

మహాలక్ష్మీ.. కరుణించు తల్లీ!



రంగంపేట, న్యూస్‌టుడే: సిరి సంపదలివ్వమ్మా శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, సాయంత్రం గిరిజా దుర్గార్చన పూజారాధనలు జరిపారు. ఉదయం 11 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అందరూ ముఖ్యులే.. సాధారణ భక్తులకు అవస్థలు!



అమ్మవారి దర్శనానికి వరుసలో ఉన్న సాధారణ భక్తులు



వీఐపీ ద్వారం వద్ద రద్దీ

రంగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులు భద్రకాళి ఆలయానికి పోటెత్తుతున్నారు. రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు, ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 2-3 గంటల పాటు అన్ని క్యూలైన్లలో సాధారణ భక్తులు బారులుతీరారు. వీళ్లను అలాగే వదిలేసి వీఐపీ(అత్యంత ముఖ్యమైన వ్యక్తి) ద్వారంలో నుంచి వందలాది మందిని ఒకేసారి లోనికి పంపించడంతో గందరగోళం నెలకొంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, అర్చకులు బంధువులు, స్నేహితులను వీఐపీ మార్గం గుండా తీసుకెళ్లారు. గంటల తరబడి సాధారణ భక్తులు క్యూలైన్లలో విలవిల్లాడారు. తాగునీటి కోసం అల్లాడారు. రద్దీని కట్టడి చేసేందుకు వెళ్లిన ఈవో శేషుభారతి సైతం అందులో ఇరుక్కుపోయారు. సాధారణ భక్తులను వదిలేసి వీఐపీ మార్గానికే ప్రాధాన్యం ఇచ్చారని భక్తులు నిలదీశారు.

ప్రైవేటు పెత్తనం..: భద్రకాళి ఆలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేరుతో పలువురు.. మాజీ ధర్మకర్తలు, దాతల పేరుతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీఐపీ క్యూలైన్ వద్ద వారిదే హవా నడుస్తోంది. కొందరు అర్చకులు సైతం అతిగా వ్యవహరిస్తున్నారు. అడ్డదారిలో భక్తులను గర్భాలయంలోకి తీసుకెళ్తున్నారు.

తెల్లబంగారం.. అన్నింటికీ ఆధారం

నేడు ప్రపంచ పత్తి దినోత్సవం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పండించే ప్రధాన పంట పత్తి.. ఇది వారికి ముఖ్యమైన ఆదాయ వనరు. సోమవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పంట ప్రధాన్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

పత్తి ప్రాధాన్యం.. ప్రాముఖ్యాన్ని గుర్తించడంతో పాటు పత్తిపై అవగాహన పెంచేందుకు, సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి దినోత్సవం ఉద్దేశం 'కాటన్ ఫర్ గుడ్'. దీనిని ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



మీకు తెలుసా..

- ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం 40 శాతం తెల్లబంగారాన్ని పండిస్తోంది.
- ప్రపంచ వ్యాప్తంగా పత్తిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురు పంటగా గుర్తిస్తున్నారు. పత్తి గింజలను వంట నూనెగా, గింజల చెక్కను పశు దాణాగా వాడుతున్నారు. కొన్ని దేశాల్లో గింజల నూనెను జీవ ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు.
- పత్తి తన సొంత బరువు కన్నా 27 రెట్లు నీటిని గ్రహించగలదు. దాంతో కావాల్సిన సాంద్రతతో వస్త్రాలను నేయవచ్చు. నాణ్యత కాటన్ ఫ్యాబ్రిక్‌కు సులభంగా రంగులు వేసేందుకు వీలుగా ఉంటుంది.
- ఓ జీన్స్ తయారీకి 0.68 కిలోలు, చొక్కాకు 0.28 కిలోలు, టీషర్టుకి 0.23 కిలోలు, డైపర్ తయారీకి 0.07 కిలోలు, టవల్‌కు 0.28 కిలోలు పత్తి అవసరమని అంచనా.

ఏడాది పొడవునా ఉపాధి..

అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ(ఐసీఏసీ) అంచనా ప్రకారం.. రైతు పండించిన ఓ టన్ను పత్తి అయిదుగురికి ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తోంది. వైద్య రంగం, పశుగ్రాసం, వంటనూనె పరిశ్రమలతో పాటు వస్త్ర పరిశ్రమలకు ఇది ముడి సరకు. వ్యవసాయం, తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి పైగా పత్తి పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. రైతులు, కూలీలతో పాటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఫిట్టర్లు, ప్రెస్సింగ్, జిన్నింగ్ ఆపరేటర్లు, హమాలీలు, మార్కెటింగ్‌శాఖ, వస్త్ర పరిశ్రమ, తదితర అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉపాధి లభిస్తోంది.

● ఉమ్మడి జిల్లాలో మొత్తం 55 జిన్నింగ్ మిల్లులుండగా.. ఒక్కో మిల్లులో సుమారు 150 మంది పనిచేస్తూ.. తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



హనుమకొండ జిల్లా ఆత్మకూరులో పత్తి తీస్తున్న మహిళా కూలీ (పాతచిత్రం)

వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

ఉమ్మడి వరంగల్‌లో పండిన పత్తిని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి స్పిన్నింగ్ చేసిన దూది బేళ్లు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, వియత్నాం, చైనా దేశాలకు ఎగుమతి అవుతుంది. పత్తి నుంచి వేరుచేసిన గింజలను వంట నూనె, పశువుల దాణా తయారీ కోసం హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

రంగురంగుల్లో.. పంట

పత్తి అనగానే మనకు తెల్లని దూది మాత్రమే స్ఫురిస్తుంది. ఆ దూదిని రంగురంగుల్లో పండించేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. నాగపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సంస్థ, దార్వాడలోని అగ్రికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన నిపుణులు రంగుల పత్తి వంగడాలను సృష్టించి, ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. సహజసిద్ధంగా పత్తికి రంగు రావడంతో.. అదనంగా పత్తి దారాలకు రంగు నీళ్లలో ముంచాల్సిన అవసరం ఉండదు. దాంతో జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో పత్తి ఆధారిత, అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ పండిన దిగుబడులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. యూరియా సంచుల్లో రైతులు పత్తిని తీసుకురావడం వల్ల తెల్లని ప్లాస్టిక్ వ్యర్థాలు పత్తిలో కలిసిపోతున్నాయి. స్పిన్నింగ్ మిల్లులు అలాంటి పత్తిని తిరస్కరిస్తున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తాల రంగును మార్చడం ద్వారా ఈ సమస్య పరిష్కరించవచ్చు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వివరాలు

● పత్తి సాగు (ఎకరాల్లో) ● దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	పత్తి సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)
వరంగల్	1,20,037	96,030
హనుమకొండ	77,330	61,864
ములుగు	21,114	16,891
జనగామ	1,25,195	1,00,156
భూపాలపల్లి	91,281	73,025
మహబూబాబాద్	78,332	62,666



సాధించిన పతకంతో సుకన్య

పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం

సీరోలు(కురవి), న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం రేకుల తండా గ్రామపంచాయతీ శివారు జగ్యాతండాకు చెందిన తేజావత్ సుకన్య కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధించారు. మారుమూల గిరిజన తండాలోని మధ్య తరగతి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె క్రీడల్లో రాణించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆమె తొలుతగా వెయిట్ లిఫ్టింగ్‌తో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందారు. 2024 జూన్‌లో దక్షిణ ఆఫ్రికా దేశంలో పవర్‌లిఫ్టింగ్‌లో రాణించి పతకం సాధించారు. ఈనెల 4 నుంచి దక్షణాఫ్రికా దేశంలోని సన్‌సిటీలో జరుగుతున్న పోటీల్లో శనివారం రాత్రి జరిగిన బాలికల విభాగం పవర్‌లిఫ్టింగ్‌లో 76 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నారు. తండ్రి లక్ష్మణ్ ఇల్లందులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న క్రమంలో తల్లిదండ్రులతో కలిసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు. అక్కడ కొంత మంది వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తుండగా వారితోపాటు సుకన్య చేసేవారు. ఆసక్తి పెరగడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొంది జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించారు. దక్షిణ ఆఫ్రికాకు వెళ్లేందుకు సహకరించిన గ్రీన్‌కో సంస్థ గ్రూపు ఛైర్మన్ అనిల్‌కుమార్‌శెట్టికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆర్.సింగారం రఘు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పిడుగుపడి ప్రైవేటు కంపెనీలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణ సామగ్రి సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నివాసం కోసం ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాల పరిధిలో క్యాంప్ ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం వెళ్లూరు జిల్లా తిరుపత్తూరు, పెరియార్‌కొట్టం ప్రాంతానికి చెందిన ఇంజినీరు ఆర్. సింగారం రఘు మూడు నెలల నుంచి పనిచేస్తున్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం ఆరుబయట చరవాణిలో మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడగా అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, 10 క్రీడా పాఠశాలల నుంచి అథ్లెట్లు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, ఇతర జాతీయస్థాయి అథ్లెట్లు, ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, వేదికపై అంబటి శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: భావితరాలకు తెలిసేలా తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేయాలని ఎమ్మెల్సీ, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ చరిత్రను మరుగున పడేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఐకాస నర్సంపేట డివిజన్ కమిటీ, తెజస ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో వేడుకల మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో కోదండరాం మాట్లాడారు. స్వయంపాలన కోసం అరవై ఏళ్లుగా ఎన్నో సంఘాలు, ఎందరో చేసిన పోరాటం, 1200 మంది ప్రాణత్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్బంధాలు, ఫోన్‌ట్యాపింగ్, అక్రమ అరెస్టులు లేవని, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పాటుపడదామన్నారు. అమరుల కుటుంబాలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులిచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద కోదండరాంకు స్థానికులు స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, వడ్డెర జాతి నాయకుడు ఓబలన్న విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రసంగిస్తూ గత పదేళ్లలో తెలంగాణ వనరులను దోపిడీ చేసిన దొంగలు పది నెలల్లో ఏదో జరిగినట్లు రచ్చ చేస్తున్నారన్నారు. ఈ సర్కార్‌ను కాపాడుకోవాలన్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ, ఉద్యమకారులు, ప్రజా సంఘాల, ఐకాస నాయకులు రామ్మూర్తి, జావిద్, అరుణ, ఖాలీ సయ్యద్, అరుణ, డాక్టర్ జగదీశ్వర్, రమాదేవి పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు కోదండరాంకు వినతి పత్రాలు సమర్పించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

స్వచ్ఛంద గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సూర్య, పెద్దలు, నాయకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచి దివంగత మడుగూరి పోతురాజు-రాజేశ్వరమ్మ దంపతుల జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని వారి స్వగృహంలో కుమారులు నాగేశ్వర్‌రావు, రాజేశ్వర్‌రావు, సుధాకర్ ఆదివారం పీఆర్ఆర్ యూనిటీ, చారిటీ ట్రస్ట్, స్వచ్ఛంద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క తనయుడు, కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి ధనసరి సూర్య హాజరై ప్రారంభించారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని, ట్రస్టును ఏర్పాటు చేసి యువత ఉపాధికి తోడ్పాటు అందించడం అభినందనీయని అన్నారు. ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కాకులమర్రి చక్రధర్‌రావు, ఎంఈవో మల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలను మెరుగుపర్చాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సోమరాజు

వెంకటాపురం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సర్కారు వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు చింత సోమరాజు అన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ ఆసుపత్రిని ఉన్నతీకరించిన ప్రభుత్వం వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు నామమాత్రంగానే అందుతున్నాయని తెలిపారు. స్త్రీ వైద్య నిపుణులను నియమించి మహిళలకు వైద్య సేవలు అందించాలని చెప్పారు. మండల శివారులో పీహెచ్‌సీ ఉండటంతో గిరిజన గ్రామాలకు ప్రాథమిక వైద్య సేవలు అందడంలేదన్నారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా ఐటీడీఏ ద్వారా సంచార వైద్య బృందాలను ఏర్పాటు చేసిన నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు పాయం వెంకటేశ్వర్లు, అట్టం రాంబాబు, గొంది శివరాము, బొగ్గం రంజిత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జలగండంలో బొమ్మాయిగూడెం

భయాందోళనలో గిరిజనులు



బొమ్మాయిగూడెం(మంగపేట),న్యూస్‌టుడే: మంగపేట మండలం కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని ఓ గిరిజన కుగ్రామం బొమ్మాయిగూడెం. ఈగ్రామంలో 30 ఇళ్లు 80 మంది ఓటర్లున్నారు. బొమ్మాయిగూడెం-కొత్తూరు మొట్లగూడెం గ్రామాలమధ్య గౌరారం వాగు ప్రవహిస్తుంటుంది. ఎగువ ప్రాంతంలో చిన్నపాటి వర్షం కురిసినా ఇది ఉద్ధృతంగా మారుతుంది. వాగుపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతాయి. మనుషులు కూడా దాటని పరిస్థితి ఉంటుంది. ఒక్కోసారి నాలుగైదు రోజులు కూడా వాగును దాటనివ్వదు. ఈ క్రమంలో ఆగ్రామంలో జ్వరం వచ్చినా.. ఇతరాత్ర పరిస్థితులు తలెత్తినా మండలకేంద్రం, జిల్లాకేంద్రానికి వెళ్లాలన్నా నరక యాతనే.


గౌరారం వాగుపై ప్రస్తుతం ఉన్న లోలెవెల్ వంతెన

మూడేళ్ల కిందట వాగు వారం రోజులుగా ఉద్ధృతంగా ప్రవహించడంతో సకాలంలో వైద్యం అందక గ్రామానికి చెందిన గర్భిణి మృతిచెందింది. 2022లో 15 రోజులు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు జ్వరాన బారిన పడిన ఈసం శరణ్ అనే పదోతరగతి విద్యార్థి సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడ్డాడు. 2023 జులై 23న వాగుదాటే క్రమంలో ద్విచక్రవాహనాలు, మనుషులు కొట్టుకుపోయిన సంఘటనలున్నాయి. గౌరారం వాగుపై పైవంతెన నిర్మించాలని 2023 ఆగస్టులో గ్రామస్థులు పీవో, కలెక్టర్‌కు వినతి పత్రాలు గ్రామస్థులు అందజేశారు.

వచ్చే వర్షాకాలంలోగా అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలి. అప్పుడే గ్రామస్థుల ఇబ్బందులను తొలుగుతాయి.

- ఈసం జోగయ్య బొమ్మాయిగూడెం

వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు పలు మార్లు మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నుంచి వంతెన నిర్మాణానికి ఇంకా నిధులు మంజూరు కాలేదు. **- ఐటీడీఏ ఏఈ రాము**

కుక్కల స్వైరవిహారం



ములుగులో కుక్కల బెడద తీవ్రంగా మారింది. చేతిలో కర్రలేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో గుంపులుగా సంచరించి దాడులకు దిగుతున్నాయి. పట్టణ ప్రజలు రాత్రిపూట బయటకు రావాలంటే జంకుతున్నారు. గతంలో ప్రజలను కరిచినట్లు సందర్భాలున్నాయి. సమస్యపై విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. అధికారులు స్పందించి వాటిని నిర్జీవ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదివారం రాత్రి రామాలయం వీధిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలను తీసిన చిత్రమిది.

- న్యూస్‌టుడే, ములుగు

సీబీఐ అధికారినంటూ రూ.28.50 లక్షల టోకరా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హనుమకొండ నగరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తకు సీబీఐ అధికారుల మంటూ సైబర్ నేరగాళ్లు రూ.28.50 లక్షలు టోకరా వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న పారిశ్రమిక వేత్తకు గుర్తు తెలియని మహిళ ఫోన్ చేశారు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్‌కార్డు మొబైల్‌కు లింక్ చేయలేదని చెప్పారు. రెండు గంటల్లో ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తామని, త్వరలో మా ఉన్నతాధికారులు మీతో మాట్లాడతారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత మరో మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ ముంబయి బ్రాంచి అధికారినంటూ పరిచయం చేసుకున్నారు. తర్వాత వాట్సప్ వీడియోకాల్ చేసి సీబీఐ కార్యాలయం మాదిరిగా ఉన్న సెట్టింగ్‌ను చూపారు. మీరు మనీ ల్యాండరింగ్‌లో పాల్గొన్నారని, మీపై సీబీఐ కేసు నమోదు చేసిందని చెప్పారు. ఎప్పుడైనా మీ వద్దకు వచ్చి మా అధికారులు అరెస్టు చేస్తారని భయాందోళనకు గురిచేశారు. నరేష్ గోయల్ అనే వ్యక్తి మీ ద్వారా సుమారు రూ.6.8 కోట్లు మనీ ల్యాండరింగ్ చేశారని, అందుకోసం మీకు రూ.18.16 లక్షల కమీషన్ ఇచ్చారని చెబుతూ. . పూర్తి వివరాలు మా వద్ద ఉన్నాయని, ఈ కేసు నుంచి మీరు తప్పించుకోలేరని బెదిరించారు. ప్రస్తుతం మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మేం సూచించిన ఖాతాలోకి మళ్లించాలని, కేసు విచారణ పూర్తయ్యాక ఎన్‌వోసీ ధ్రువీకరణతో పాటు మీ డబ్బు అప్పగిస్తామని నమ్మించారు. వారి మాటలకు భయపడిన పారిశ్రమిక వేత్త తనకు ఉన్న రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.28.50 లక్షలు వారు చెప్పిన ఖాతాలోకి మళ్లించారు. రెండ్రోజుల తర్వాత అవతలి వ్యక్తుల నెంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి పారిశ్రమిక వేత్త పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని బీరెల్లిలోని నాలుగు, ఐదో వార్డులో రెండు నెలల నుంచి నీటి సరఫరా జరగడం లేదు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించాలి.

- నూషెట్టి రాము, బీరెల్లి

సమస్య మా దృష్టిలో ఉంది. విషయాన్ని పలు దఫాలుగా ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, జిల్లా పాలనాధికారుల దృష్టికి తీసుకుపోయాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. **- చందూలాల్, పంచాయతీ కార్యదర్శి, బీరెల్లి**

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం


హుస్సేన్ (పాత చిత్రం)

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి దుర్మరణం చెందిన సంఘటన ములుగు మండలం చిన్నగుంటూరుపల్లి శివారు అన్నంపల్లి చిర్రకుంట వద్ద ఆదివారం జరిగింది. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. దేవగిరిపట్నం గ్రామానికి చెందిన తేజావత్ హుస్సేన్ (28), అదే గ్రామానికి చెందిన వాంకుడోత్ దశరథ్‌తో కూలిపనికి వెళ్లాడు. ట్రాక్టర్ ఇంజన్‌పై ఎరువు బస్తాలు తీసుకుని అన్నంపల్లి శివారులో ఉన్న చిర్రకుంట కట్ట నుంచి పొలాల వద్దకు చేరుకుని బస్తాలను దింపారు. హుస్సేన్ చెరువుకట్టపై నుంచి ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తున్న క్రమంలో అదుపు తప్పి ఇంజన్ మధ్యలో పడి మృతి చెందాడు. మృతుడి తల్లి తేజావత్ ద్వాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విష జ్వరంతో ఒకరి మృతి

ములుగు టౌన్: విషజ్వరంతో ఒకరు మృతి చెందిన సంఘటన ములుగు మండలం జంగాలపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. . రెడ్డబోయిన రాజు (40) మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బందులు పడుతుండటంతో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. 2 సంవత్సరాల క్రితం భార్య మృతి చెందింది. తండ్రి మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లు తేజస్విని, వైష్ణవి అనాథలుగా మిగిలారు. గ్రామస్థుల సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఇద్దరిపై కేసు నమోదు

వాజేడు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తాళ్లగూడెం నుంచి గుడుంబాను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై వాజేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరీశ్ కథనం ప్రకారం.. మండపాక సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. ఏటూరునాగారం మండలం శంకర్రాజుపల్లికి చెందిన ఏ.రవి, ఏ.నాద్‌లను పట్టుకుని తనిఖీ చేయగా సంచిలో రూ.80వేలు విలువైన200 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. గుడుంబా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశువులను తరలిస్తున్నవారిపై కేసు


వాహనంలో పశువులు

వాజేడు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాదులోని గోవధశాలకు పశువులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై వాజేడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో తరలిస్తున్న పదకొండు పశువులను గుర్తించారు. అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తున్న షేక్ ఆలీ, షేక్ మొయినుద్దీన్‌లపై కేసు నమోదు చేసి, పశువులను గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు.. ఆదివారం పలుచోట్ల అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంలో


గోవిందరావుపేటలో హోమం చేస్తున్న భక్తులు..

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. వేదపండితులు నిత్యహోమం, కలశపూజ, లక్ష్మీనర్సింహస్వామి అభిషేకం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏటూరునాగారం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో దుర్గామాతను ఆదివారం శాకాంబరీదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెండ్యాల ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

చండీదేవి అలంకరణలో



మంగపేట,న్యూస్‌టుడే: శ్రీఉమాదేవి శరన్నవరాత్రి (దసరా) మహోత్సవాల్లో భాగంగా మంగపేట ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారిని చండీదేవి రూపంలో అలంకరించారు. పూజారి విస్సావజ్జుల నరేష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ కొమరగిరి కేశవరావు, సభ్యులు సామ్రాజ్యం, సురేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా



వాజేడు: ధర్మారంలో దుర్గామాతను మహాలక్ష్మీ దేవి అలంకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

దుర్గామాతకు రక్షణగా చేపల వల



వెంకటాపూర్: మండలంలోని పాలంపేటలో కోతుల బెడద ఎక్కువగా ఉంటుంది. దుర్గామాతకు కూడా ఆ ఇబ్బందులు తప్పలేదు. రోజంతా భక్తులతో కళకళలాడే దుర్గామాత మందిరం రాత్రి సమయంలో భక్తులు నిద్రిస్తున్నారు. దాంతో ఎవరూ లేని సమయంలో కోతులు వచ్చి చిందరవందర చేస్తున్నాయని గమనించిన భక్తులు మండపం ముందు భాగంలో పూర్తిగా చేపల వలను రక్షణగా ఏర్పాటు చేశారు.

శాకాంబరీగా



ములుగు: ములుగులోని రామాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత లలితా త్రిపురా సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాతను సాయంత్రం పలు రకాల కూరగాయలతో శాకాంబరీగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పైడిమల్ల శోభారాణి-అనిల్ కుమార్ దంపతులు అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నల్లగుంటలో


వెంకటాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లలితా త్రిపురాసుందరీదేవిగా

వెంకటాపూర్: మండలంలోని కేశవాపూర్, పాలంపేట, నల్లగుంట, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. దుర్గామాత.. లలితా త్రిపురా సుందరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాల నిమజ్జనానికి సర్వం సిద్ధం

ములుగు టౌన్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరాస పండగలకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ములుగు పట్టణంలో ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే రవాణాసురవధ స్థలం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

తోపుకుంట వద్ద: ములుగు పట్టణం మహిళలంతా ఆడిపాడి బతుకమ్మలను నిమజ్జనం చేసే తోపుకుంట వద్ద పంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్తు దీపాలను బిగిస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. 42 మందితో పోలీసు బందోబస్తు నడుమ ఏర్పాట్లును సిద్ధం చేస్తున్నారు.

అందుబాటులో 40 మంది సిబ్బంది

- పంచాయతీ కార్యదర్శి రఘు

పత్తిపల్లి క్రాస్ స్వాగత తోరణం నుంచి తోపుకుంట స్వాగత తోరణం వరకు విద్యుత్తు ఎల్ఈడీ లైట్లను, సిరీస్ లైట్లను ఏర్పాటు చేస్తున్నాం. సద్దుల బతుకమ్మ ఉత్సవాలను తెరల ద్వారా వీక్షించడానికి ఎల్ఈడీ స్క్రీన్లు ఉంటాయి. 40 మంది పంచాయతీ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

ఆటంకాలు లేకుండా చూస్తాం

- ఎస్సై వెంకటేశ్వరరావు, ములుగు


తోపుకుంట వద్ద జరిగే నిమజ్జనంతో పాటు ములుగు రామాలయం వద్ద జరిగే దసరా ఉత్సవాలు, ములుగు సాధన స్కూల్ సమీపంలో జరిగే రావణాసురవధ కార్యక్రమం వరకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. రావణాసురవధ కార్యక్రమానికి 10 వేల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పలు మండలాల సిబ్బందిని నియమిస్తాం.


రావణాసురవధ నిర్వహించే స్థలం


తోపుకుంట వద్ద స్వాగత తోరణం

బంతిపూల సాగు.. లాభాలు బాగు..!

పచ్చని పొలాల మధ్య రంగురంగుల తివాచీ పరిచినట్లు బంతి పూలు ఆహ్లాదంగా, అందంగా కనువిందు చేస్తున్నాయి. ములుగు జిల్లా మండల కేంద్ర సమీపంలోని జాతీయ రహదారి పక్కనే జాకారం గ్రామం వద్ద ఈ బంతి పూల తోట ఉంది. కొంత మంది నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారని రైతు దేవునూరి రమేష్ తెలిపారు. పండగల సందర్భంగా గిరాకీ బాగుందని చెప్పారు. 5 గుంటల విస్తీర్ణంలో పెట్టిన ఈ బంతిపూల సాగుకు రూ.పది వేలు పెట్టుబడి అయిందని, అన్ని ఖర్చులు పోను రూ.10 వేల పైనే మిగులుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మూడేళ్ల నుంచి బంతిపూల సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. **– ఈనాడు, హనుమకొండ**



పాముకాటుకు గురై అస్వస్థత

వెంకటాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పాత్రాపురానికి చెందిన అల్లి రవీందర్ పాముకాటుకు గురై అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా కాలుపై పాము కాటువేసింది. కేకలు వేయడంతో సమీపంలోని రైతులు అక్కడకు చేరుకుని పామును చంపారు. చికిత్స కోసం బాధితుడిని వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం ప్రమాదం లేదని పేర్కొన్నారు.

రహదారిపై గుంతలు.. వాహనదారుల ఇబ్బందులు


తాడ్వాయిలో జాతీయరహదారిపై కొట్టుకుపోయిన తారు

తాడ్వాయి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా రహదారుల అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదు. రహదారుల అభివృద్ధి మాటేమిటోగాని కనీసం మరమ్మతులకు సైతం నిధులు విడుదల చేయలేని దుస్థితి నెలకొంది. గత నెల కురిసిన భారీ వర్షాలకు వివిధ గ్రామాల్లోని చాలా రహదారులు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ వరదలకు మండలకేంద్రానికి సమీపంలో తాడ్వాయి-ఏటూరునాగారం మధ్యలో జాతీయరహదారి కోతకు గురై.. అక్కడక్కడ గోతులు పడ్డాయి. దీంతో నిత్యం ప్రయాణించే వందలాది వాహనాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. పర్యాటక జిల్లాగా గుర్తింపుపొందిన ఏటూరునాగారం ప్రాంతానికి రాష్ట్రం నలమూలల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. రహదారులు సరిగ్గా లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని అంచనా వేయకుండా అధికవేగంతో ప్రయాణించే కార్లు, లారీలు సైతం ప్రమాదాలకు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రహదారి మరమ్మతుల గురించి జాతీయ రహదారుల సహాయ ఇంజినీరు కుమారస్వామి న్యూస్‌టుడే వివరణ కోరగా రహదారి శాశ్వత అభివృద్ధి, తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేసి పంపించామని చెప్పారు. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశముందన్నారు. నిధులు మంజూరవ్వగానే పనులు చేపడతామన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని బీరెల్లికి చెందిన మంతెన సందీప్ ఇటీవల మరణించారు. ఉపాధి కోసం హైదరాబాదుకు వెళ్లి ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనస్థితిలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించడంతో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల నగదు, బియ్యం నిత్యవసర సరకులు అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ముజాఫర్, బెజ్జూరి శ్రీనివాస్, ఇర్సవడ్ల నారాయణ, వంగరి సదానందం, కాయితి లింగాచారి తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని గూర్రెవుల గ్రామానికి చెందిన వాసంపల్లి.శివలీల అనారోగ్యానికి గురైంది. పేద కుటుంబానికి చెందిన బాధితురాలు వైద్య సేవలకు నగదు లేక ఇబ్బందులు పడుతోంది. ముప్పనపల్లికి చెందన గ్రామస్థులు అండగా నిలిచారు. దాతల ద్వారా సేకరించిన రూ.35 వేలు వైద్య సేవల కోసం అందించినట్లు సతీష్, ఫైజోద్దీన్ తెలిపారు.

ములుగు: మండలంలోని కొడిశలకుంట గ్రామానికి చెందిన కొండ్రాతి సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రజక సంఘం నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శంకర్, నాయకులు పావురాల బిక్షపతి, నాంపల్లి స్వామి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక చేయూత

పాలాయిగూడెం(మంగపేట),న్యూస్‌టుడే: మండలంలోని పాలాయిగూడెంకు చెందిన నిరుపేద విద్యార్థిని చింత రేష్మశరణ్య ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న శ్రేయధ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థినికి రూ.10వేలు ఆర్థిక సాయం అందేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గొప్ప సమ్మారావు, చెంచయ్య, సభ్యులు మోడెం హన్మంతరావు, అంజయ్య, కృష్ణయ్య, సారంగపాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ మీట్‌కు జిల్లా పోలీసుల ఎంపిక

ములుగు టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో మొదటిసారిగా నిర్వహిస్తున్న పోలీస్ డ్యూటీ మీట్‌కు ములుగు జిల్లా పోలీసులు ఎంపికైనట్లు ఎస్పీ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 25న జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచారు. గురు, శుక్రవారం రామగుండం కమిషనరేట్ పరిధిలో జరిగిన పరిశోధన, శాస్త్రీయ జోనల్ స్థాయి పోటీలలో తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విధ్వంస వ్యతిరేక తనిఖీ విభాగంలో ములుగు ఏఎస్సై జాకీర్ హుస్సేన్, కానిస్టేబుల్ రాజేష్, కంప్యూటర్ అవగాహనలో కానిస్టేబుల్ అనిల్, ఆఫీస్ ఆటోమేషన్‌లో కానిస్టేబుల్ భరత్, డాగ్ స్క్వాడ్, మందుపాతర తనిఖీ విభాగంలో నరేష్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 14 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వారిని ఎస్పీ శబరీష్ అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

తాడ్వాయి, న్యూస్‌టుడే: ఆత్మ రక్షణకు కరాటే దోహద పడుతుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మండలంలోని మేడారంలో గత మూడు రోజులుగా జరుగుతున్న షోటోకాన్ కరాటే శిక్షణ తరగతులు, పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.